# భాగ్యవిధాతలు

ఆ రోజు నేను భయపడ్డాను.

ఉదయం ఆరుగంటలప్పుడొకసారి. సాయంకాలం అయిదు గంటలప్పుడొకసారి. వెరశీ రెండుసార్లు ఉభయ సంధ్యల్లోనూ భయపడ్డాను.

ఉదయం నేనెందుకు భయపడ్డానో చెబితే మీరాశ్చర్యపడరు. సాయంకాలం ఎందుకు భయపడ్డానో తెలిస్తే మీరాశ్చర్యాపడకుండా వుండలేరు.

నోరు తెరచుకోని గాండ్రిస్తూ మీదకొచ్చే బెబ్బులిని జూచి భయపడ్డంలో అర్థముంది. కానీ పచ్చిక మైదానంలో అమాయకంగా విహరించే జింకపిల్లను చూచి భయపడ్డంలో అర్థముందంటారా?

ఎట్టయెదుట నూరు నిలువు లోతున్న భీకర కందకాన్ని చూచినప్పుడు భయపడ్డంలో అర్థముంది. రమణీయ ప్రకృతి దృశ్యాన్ని చూచి భయపడ్డంలో అర్థముందంటారా?

మరింత విశదంగా చెప్పాలంటే కాలిపోతున్న యిళ్ళను చూచినప్పుడు, ఎండిపోతున్న పైర్లను చూచినప్పుడు, అంటురోగాల విజృంభణను చూచినప్పుడు భయపడ్డంలో అర్థముంది.

కానీ కలకలలాడే పువ్వుల్ని చూచి, ఉత్సాహంతో త్రుళ్ళింతలిడే లేగదూడల్ని చూచి, స్వేచ్ఛగా ఎగిరిపోయే పక్షుల్ని చూచి భయపడ్డంలో అర్థముందంటారా?

పైన పేర్కొన్న పూర్వాపర దృశ్యాల్లో మొదటి రకానికి చెందినవి మాత్రమే మనిషిని భయపెడతాయని మీరనుకుంటారు. రెండో తరహాకు చెందినవి మనసును అలా అలా ఆనందలోకాలకు తీసుకెళ్తాయని అనుకుంటారు. కానీ నన్నీ రెండో తరహాకు చెందిన దృశ్యం ఒకటి ఆనాటి సాయంకాలం గుండెలు గుభిల్లుమనేట్టుగా చేసింది. ఒళ్ళంతా చెమట పట్టేట్టుగా చేసింది. ఎందుకు ఏమిటి ఎలా అని అడగండి. మనవి చేస్తాను అవధరించండి.

* * *

నాది పెళ్ళిళ్ళ పేరయ్య వృత్తిగాదు. కానీ మా పొరుగింటి చంద్రయ్య చౌదరి నాకు బాగా కావలసిన మిత్రుడు. వరుసగా ముగ్గురు ఆడపిల్లలాయనకు. చిట్టచివర ఉడుబోతుకాయలా ఒక మగపిల్లవాడు కూడా వున్నాడు. కానీ యిప్పుడొచ్చిన చిక్కు వాడితో గాదు. ఒకటి రెండేళ్ళు తేడాగా పుట్టారేమో ఆడపిల్లలు, యించుమించు ఒకటేసారిగా పెళ్ళికి సిద్ధమై కూచున్నారు. అమ్మాయిలేమో అపరంజి బొమ్మలే. వాళ్ల అమ్మమ్మగారివూరు మదనపల్లి గావడంవల్ల, ఆ కుటుంబంలో చిన్నబిడ్డలెవరూ లేకపోవడంవల్ల వీళ్ళక్కడుండి బుద్ధిగా బియ్యేలు, బీయస్సీలు చదువుకున్నారు. ఏదైనా ఉద్యోగం దొరికితే చేయాలని గూడావుంది వీళ్ళకి! కానీ తమ కూతుళ్ళు ఉద్యోగాలు చేయడంకన్నా కాపురాలకు వెళ్లడం ప్రశస్తమని తల్లిదండ్రుల ఉద్దేశం. వరుసగా ఒక్కొక్కరినీ సాగనంపడానికి జరుగుతున్న ప్రయత్నం ఈనాటిదిగాదు. నాలుగేళ్ల నుంచీ కొనసాగుతోంది. ఇటీవలే తిరుపతినుంచి సుందరరాజుల నాయుడుగారి యిలాకా వాళ్ళు పెళ్లిచూపుల కొచ్చి వెళ్లారు.

అబ్బాయి ఇంజినీరు. అతగాడికి పిల్ల నచ్చింది. ఇక మిగిలిన విషయాలన్నీ మాట్లాడి సంబంధం స్థిరపరచుకు రావడానికి నా మధ్యస్థం అవసరమైంది.

"మేష్టరుగారూ, సాటి కులస్థుల్లో ఎవరినైనా పంపుకుందామంటే నాకు నమ్మకం చాలటంలేదు. నూరబద్ధాలు చెప్పి ఒక పెళ్ళి కుదర్చాలంటారు గదా! అబద్ధాలు చెప్పకపోతే

నూనె! నిజాలు చెప్పినాచాలు. చెప్పరు. నేనిక్కడ లక్షలకు లక్షలుగా ముల్లె కట్టిపెట్టుకున్నట్టు చెబుతారు. 'అమ్మో, అసాధ్యపు ఘటంకదండీ! మీరొకపట్టు పట్టకపోతే లొంగిరాడు' అంటూ వూదరబెడతారు. అందువల్ల తమ కొరిగేదేమీ లేకపోయినా, సంబంధాలు వీగిపోవడమే వీళ్ళ కిష్టం. ఎందుకు బాబూ, మీరు వెళ్ళిరండి. ఎటూ సుందరరాజులు మీకు బాగా తెలిసిన వారేనాయె! ఉన్న వాస్తవాలు చెప్పండి. మనం ఎంతవరకు తూగగలమో తెలియజెయ్యండి. ఒప్పుకుంటే సరే! లేకపోతే మనమేం చెయ్యగలం? ప్రయత్నించడమే గదా మన వంతు..." అంటూ ప్రాధేయపడ్డాడు చంద్రయ్య చౌదరి.

చంద్రయ్య పనిపైన తిరుపతికి బయల్దేరవలసివచ్చింది.

వూరికొక ఫర్లాంగు దూరంలో, ఎత్తయిన మట్టి కట్టపైన, పెద్ద పెద్ద సీమబాగి చెట్ల నీడలో మా వూరి స్టేషన్ చాలా అందంగా వుంటుంది. కాని అందమైన సినిమా వాల్‌పోస్టరు మీద పేడముద్దల్లా ఆనాటి వుదయం నాకు ప్లాట్‌ఫారంపైన పదిపదిహేనుమంది కుర్రాళ్ళు కనిపించారు. పది పదకొండేళ్ళ దగ్గర నుంచి అందరికీ పదహారుకు మించని వయస్సే. మురికి పేరుకుని గోతాం పట్టాల్లా తయారైన నిక్కర్లు, చొక్కాలు, మట్టి గొట్టుకపోయి దట్టంగా బూడిద పూసుకున్నట్టున్న శరీరాలు, చింపిరితలలు, లోతుకుపోయిన కళ్ళు. వాళ్లొక కిరాతకుడైన బ్రహ్మ చేతిలో సృష్టిలా వున్నారు.

అందరూ నేలపైన పడుకోడమే! కానీ ఆ పడుకోడంలో హేలా విన్యాసాలు వేర్వేరు. ఒకడి కాళ్ళపైన తలపెట్టుకుని ఒకడు, వాడి నడుముపైన సోలిపోయి యింకొకడు, వీడి పొట్ట కానుకున్నట్టుగా వేరొకడు...

బీడీల స్టాకు అయిపోందేమో, వాళ్ళు కాల్చి పారేసిన వాటినే ఏరి ఏరీ పెదవులొకవైపున కాలిపోతున్నా మళ్ళీ మళ్ళీ వూది పారేస్తున్నారు.

గడచిన రాత్రి తొమ్మిది గంటల బండిలోనుంచి తమను బలవంతంగా దింపేసిన టికెట్టు కలెక్టరును బండ బూతులు తిట్టుకోడం వాళ్ళ ప్రస్తుత కాలక్షేపం.

రైలొచ్చి స్టేషనులో ఆగేసరికి వాళ్ళు పట్టాల కటువైపుగా వెళ్లిపోయారు. ఆగిన రైల్లో నుంచి గార్డు తమను గమనిస్తున్నాడని తెలిసేసరికి మూలకొకరుగా పారిపోయారు. మళ్ళీ రైలు కదిలేసరికి, ఎలాగో కమ్ములు పట్టుకుని ప్రాకి పెట్టెల్లోకి వచ్చేశారు.

జనాభా లెక్కలలోకెక్కని ఈ శాల్తీలు, చిరునామాలేని ఈ జాబులు, టిక్కెట్టులేని ఈ ప్రయాణికులు, ఉగాదులు, ఉషస్సులూ లేని ఈ వక్రజీవులు వీళ్లు గూడా భారతమాత సంతానమేనా? వీళ్ళవల్ల దేశం ఏమయ్యేటట్టు?

...నా వెన్నెముకలో రివ్వుమంటూ వో భయ వీచిక ప్రాకింది...

వెళ్ళిన సమయానికి సుందరరాజులు నాయుడుగారు ఇంటిదగ్గరే వున్నాడు. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం ఆయన ముఖ్యవృత్తి. గ్లాసు నిండా టొమాటో పళ్లరసం యిప్పించి 'యిక కానియ్' మన్నట్టుగా వాళ్ళు భార్యా భర్తలిద్దరూ దేవీ దేవరల్లా నా ఎట్ట ఎదుట కొలువుదీరి పోయారు.

"చెప్పండి నాయుడుగారూ! పిల్లను తీసుకునేవాళ్లు మీరు. ఇచ్చుకునే వాళ్లం మేము. ఏమడిగినా మీరే అడగాలి...." అన్నాను.

నాయుడుగారు ముక్కి మూలిగి గొంతు సవరించుకునేలోగా మిసెస్ నాయుడుగారి వోపిక హరించుకపోయింది. ఆమె భర్తతో మీరుండండి నేను చెబుతానని వాచ్యంగా చెప్పలేదు. కానీ ప్రసంగం ప్రారంభించిన వైఖరిలో నాకామాత్రం చొరవ కానవచ్చింది.

"చెప్పడాని కేముందండి అన్నగారూ! ఈ రోజుల్లో మార్కెట్టు కొచ్చే వాళ్ళు గూడా కూరగాయల రేట్లడగడం లేదు. తూకం వేయించుకోడమూ, ఎంతయిందని అడగడమూ, యిచ్చేసి చక్కావెళ్ళిపోవడమే! అంటే ఏమన్నమాట? డబ్బు ముఖ్యంగాదిప్పుడు, వస్తువే ముఖ్యమైపోయింది. వస్తువు మంచిదైనపుడు అది మనకు కావాలనుకున్నప్పుడు మనం డబ్బు ముఖంచూడగూడదు..."

"సరేనమ్మా! మీరెంతిమ్మంటారో, ఎలాంటి లాంఛనాలు జరపమంటారో తెలుసుకోవాలి గదా" అన్నాను నీళ్లు నములుతూ.

"అన్నగారూ! మీకు తెలుసునో తెలియదోగానీ ఈ రేట్లల్లో గూడా చాలా బేబందులున్నాయి. దూరాభారమనుకోకుండా కాలుదీసి, పెన్నదాటి అటువైపుకు వెళ్తే మాకు చాలా లాభసాటి బేరమే తగలొచ్చు. అక్కడైతే ఇంజనీరుకు లక్షా, లక్షన్నరా, డాక్టరైతే రెండు లక్షలదాకా యిస్తున్నారట! మా మేనత్తగారి ఆడపడుచు కొడుకు నరహరి అని వున్నాడులెండి, జూనియర్ లెక్చరరే – వాడికి గుడ్లవల్లేరు సంబంధం కుదిరింది. నెట్‌క్యాషు డెబ్బయి అయిదువేలిచ్చి, యాభై సావరన్ల బంగారం పెట్టారు. చాలని దానికి డ్రస్సుకని, ఫర్నిచర్‌కని, పాత్రసామాన్లకనీ, రేడియోకనీ పదివేలదాకా అయివుంటుంది. పైపెచ్చు మన తిరుచానూరు సత్రంలోనే ఘనంగా పెళ్ళి గూడా జరిపించారు. మొన్నీ మధ్య మేము నెల్లూరు దాటి సింగరాయకొండ పెళ్ళికి వెళ్ళొచ్చాము. ఇప్పుడు మావారు లేరూ, వీరి పెదనాన్న గారి మనవడికే పెళ్ళి. అబ్బాయికి ఏర్‌ఫోర్స్‌లో ఉద్యోగం. వాళ్ళయితే అదేమిటిదేమిటనీ కట్నానికి బదులు ఏకంగా వరుడికి పదిహేనెకరాల పొలమే రాసిచ్చేశారు. దాన్నిప్పుడమ్ముకున్నా అయిదు లక్షలు చేతికొస్తుందంటున్నారు. అదృష్టమంటే అలా వుంటుంది మరి! అయితే ఒకటి, దూరపు కొండలు నునుపనుకోకుండా మేము చంద్రయ్యగారి సంబంధం వేపు మొగ్గు జూపిస్తున్నామంటే అందుకు కారణం వుంది. ఉన్నమాట చెప్పుకోవాలిగదా! మావాడికి వాళ్ళమ్మాయి నచ్చింది. సరేనయ్యా, ఒప్పుకుంటాము. మీ అమ్మాయి చక్కని చుక్కే. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. కానీ మావాడేమీ పనికిరానివాడుకాదే! మేమున్నా అయిన డబ్బంతా పోసి వాణ్ణి చదివించాము గదా? ఇక్కడ మన వూర్లో సీటురాకపోతే బెంగుళూరులో అదేదో ప్రయివేటు కాలేజీలో అయిదువేలు డొనేషన్ యిచ్చి చేర్పించామాయే! అయిదారేండ్లదాకా నెలనెలా మూడు వందలదాకా పంపుకున్నామాయె! మాకెంత ఖర్చయివుంటుందో చెప్పండి. ఈ విషయాలన్నీ మీరు మనసులో పెట్టుకోవాలి. మీరైనా లోకమంటే ఏమిటో తెలియని వాళ్లుగాదు. చంద్రయ్యగారి అత్తగారి వూరు మదనపల్లెలో ఇటీవల రాటకొండ వారి అబ్బాయి ఒకడు 'ఇంజనీరు' చదివి, గూడూరు సమీపంలో రాటాపాకాడులో ఏటుకూరివారి సంబంధంలో పెళ్లి చేసుకొచ్చాడు. వాడికెంత యిచ్చారో తెలుసుకో మనండి. మాకామాత్రం యిప్పించండి. చాలు."

హాల్లో వాతావరణం చల్లగానే వుంది. పైన ఫాన్ గూడా తిరుగుతోంది. అయినా ఎందుకో నా నాలుకపైన తడి ఆరిపోయింది. ఒక గ్లాసెడు మంచినీళ్ళు తెప్పించుకుని త్రాగిన తర్వాతగానీ మాట్లాడలేకపోయాను.

"చూడండి నాయుడుగారూ! మీ ఆవిడగారు మీ అంతర్యమేమిటో చెప్పేశారు. ఇక నేను చంద్రయ్యగారి తరఫున నాలుగు మాటలు చెప్పుకోవలసి వుంది. చంద్రయ్య ఒక పెద్ద రైతేగానీ, గొప్ప భూస్వామి కాదని మీరు గుర్తుపెట్టుకోవాలి. ఆయనకు ఎనిమిదెకరాల

మడి వుంది. అయిదెకరాల చేనుంది. ఏడాదికో వెయ్యి రూపాయల మహసూలు వచ్చే మామిడి తోటవుంది. డబ్బు గూడా పాతిక వేలదాకా వుండే వుండవచ్చు. ఆయన కొక్కతే కూతురైతే మీకు తృప్తికలిగేటంతగా యిచ్చుకోడానికి వీలుండేదేమో. ఇంకా యిద్దరు కూతుళ్ళుండిపోయిరి. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయవలసి ఉంది. పోగా బ్రేలిడంత కుర్రాడొకడున్నాడు గదా. వాడి హాయం వచ్చేసరికి వాడికేమీ లేకుండా చేయటమున్నూ భావ్యంగా వుండదు.."

"పంతులుగారూ! ఈ నసుగుసల బేరాలెందుకు? మీ చంద్రయ్యగారు ఎంతియ్యగలరో చెప్పండి. ఆ తర్వాత యిది అయ్యేపనో, కానిపనో మేము తేల్చి చెప్పేస్తాము" అన్నారు నాయుడుగారు భార్యవైపు భావగర్భితంగా చూస్తూ.

"చెప్పమన్నారు గనుక చెబుతున్నాను. మీరుగూడా కొంచెం పెద్దమనసు పెట్టాలి. కేవలం డబ్బును మాత్రమే గాకుండా అవతలి మనుషుల మంచితనాన్నీ, సాంప్రదాయాన్నీ గూడా లెక్కకు తీసుకోవాలి. చంద్రయ్య తానింత యివ్వగలనని నాతో చెప్పలేదు. కానీ అతడి స్తోమత ననుసరించి,మీరెంతవరకు ఆశించడానికి వీలుంటుందో చెబుతున్నాను. డబ్బు పాతికవేలు. బంగారం గూడా పాతిక తులాలు, అంతకుమించి అతడినుంచి ఆశించడం న్యాయంగాదు..."

ప్రత్యుత్తరంగా నాయుడుగారి భార్య పెదవి మాత్రమే విరిచింది. కొద్ది నిమిషాల తర్వాత ఈ చర్చయింక కొనసాగడం నిష్ప్రయోజన మన్నట్టుగా, లేచి లోపలికి వెళ్లిపోయింది.

మరింక మీరు చెప్పేదేమైనా వుందా - అని అడగడమంటే తెగేదాకా లాగి నష్టపుతుందేమో! వాళ్ళంతట వాళ్ళు నోరుతెరిచేదాకా వూరుకోవడమే మంచిదనుకున్నాను.

మధ్యాహ్నం భోజనమైంది. భోజనానంతరం కాసేపు పడుకుని లేవడమైంది. ఉండి ఉండీ వెళ్లొస్తానని చెబితే 'ఎండ తగ్గనీండి' అన్నారు నాయుడుగారు. కాఫీ పుచ్చుకోడమైంది. బయల్దేరాను. సాగనంపడం కోసం వీధి మలుపుదాకా వచ్చిన నాయుడుగారు "పంతులుగారూ! ఆఖరుమాట ఒకటి వినండి" అన్నారు.

"చెప్పండి" అన్నాను.

"బంగారం అయిదుతులాలు ఆటో, యిటో అయినా ఫరవాలేదు. కట్నం మాత్రం యాభైవేలు అంతకు పైసా తగ్గడానికి వీల్లేదు..."

తిరిగి చూడకుండా వీధుల వెంట నడుస్తున్నాను. దారిపొడుగునా నాయుడు గారి చివరి మాటలే నా చెవుల్లో రింగు మంటున్నాయి.

ఈ లెక్కన పెద్దమ్మాయిని వదిలించుకోడానికి చంద్రయ్య ఒక లక్షరూపాయల దాకా వెచ్చించుకోవలసి వుంటుంది. ముగ్గురమ్మాయిలకు మూడు లక్షలనుకుంటే ఆఖరుకతడికి తలదాచుకోడానికి యిల్లయినా మిగలకపోవచ్చు

ఒక అబద్ధం చెప్పడానికి వెనుకాడిన నేరానికి, భార్యతో, బిడ్డతో దేశాలపాలై పోయిన హరిశ్చంద్ర మహారాజులా, ఆడబిడ్డల్ని గన్న నేరానికి మా చంద్రయ్య భార్యతోనూ, కొడుకుతోనూ బికారివాడై పోయే దృశ్యం నా గుండెల్ని పీల్చి పిప్పిచేసింది.

నడుస్తున్నాను.

కల్లోలితమైపోయిన మనసుతో, బరువుగా అడుగు లేసుకుంటూ, ఎవరో మెడబట్టి గెంటుతున్నట్టుగా ముందుకు కొట్టుకుపోతున్నాను.

దగ్గర్లో అమ్మాయిల హైస్కూలొకటి వుండాలి. బడి వదిలినట్టున్నారు. వందల కొలది మంది అమ్మాయిలు, పువ్వుల్లా కలకల లాడేవాళ్ళు, పూలతీగల్లా సుకుమారమైన వాళ్ళు, క్రొక్కారు మెరపుల్లా అందమైన వాళ్ళు, నిండుగా, బొద్దుగా, సన్నగా, పొడుగ్గా వివిధ రకాల ఆకారా వాళ్ళు--- భావిభాగ్యోదయ సౌధంలో మణిదీపికల్లా వెలగవలసిన చిన్నారి తోబుట్టువులు బిలబిలమంటూ నా ఎదుట కొచ్చేశారు. నన్ను దాటుకుని ముందుకు వెళ్ళిపోతూనూ వున్నారు.

నేను మాత్రం చేష్టలుడిగి 'కీ' పూర్తయిపోయిన మరబొమ్మలా కదలలేకుండా నిల్చుండిపోయాను.

కొద్ది క్షణాల దాకా నా గుండె కొట్టుకోడం గూడా మానేసింది.

● ఆంధ్రప్రభ ఆదివారం 1978 ●